సాక్షి
జగిత్యాల
శనివారం । 22 । జూన్ । 2024




## కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

జగిత్యాల: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లాపై చర్చించారు.



## జ్యేష్ఠ పౌర్ణమి వేడుకలు

ధర్మపురి: పట్టణంలో జ్యేష్ఠ పౌర్ణమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహిక వట సావిత్రి వ్రతాలు చేశారు. తమ సౌభాగ్యాలను కాపాడాలని వేడుకున్నారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

### న్యూస్‌రీల్

## పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



విద్యార్థుల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్


**జగిత్యాల/జగిత్యాలరూరల్:** జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం పురాణిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ధరూర్‌క్యాంప్‌లోని కేజీబీవీ, హన్మాజీపేటలోని ప్రాథమిక పాఠశాల, జాబితాపూర్‌లోని జెడ్పీ పాఠశాల, పెర్కపల్లిలోని ఎంపీపీఎస్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను యూనిఫామ్స్, పాఠ్యకాలు పంపిణీ, హాజరుశాతంపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి విద్యా బోధనకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని, పారిశుధ్యం నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

## తేలికపాటి వర్షసూచన

**జగిత్యాలఅగ్రికల్చర్:** రాబోయే ఐదు రోజుల్లో జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురువడంతో పాటు వాయువ్య దిశ నుంచి 30–40 కి.మీ.వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 36–42 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ఠ ఉష్ణోగ్రత 23–27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు. గాలిలో తేమ ఉదయం 76–99 శాతం, మధ్యాహ్నం 53–92 శాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

# రైతన్న మురిసె..

- రుణమాఫీతో అన్నదాతల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.2000 కోట్లకుపైగా అవసరం
- గతేడాది డిసెంబరు 9లోపు క్రాప్‌లోన్ తీసుకున్న వారికే!
- మార్గదర్శకాలు వస్తేనే అమలుపై మరింత స్పష్టత
- ప్రభుత్వం వద్ద ఇప్పటికే లబ్ధిదారుల వివరాలు




**సాక్షిప్రతినిధి,కరీంనగర్:** రాష్ట్రంలోని రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తీపి కబురు తీసుకొచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం కేబినెట్‌లో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్య ఐదేళ్లకాలంలో తీసుకున్న రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. వచ్చే ఆగస్టు 15వ తేదీ నుంచి ఏకకాలంలో రుణమాఫీని అమలు చేస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలోనే విడుదల కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రైతు రుణాల మాఫీకి దాదాపుగా రూ.31వేల కోట్లకుపైగా నిధులు అవసరం అవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాకు ఎంతలేదన్నా రూ.2000 కోట్లకుపై నిధులు అవసరం అవుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లిలో అధికశాతం చిన్న కమతాలను (ఒకటి, రెండు ఎకరాలు) సాగు చేసే రైతులే ఉన్నారు. వీరిలో పంటల ఆధారంగా ప్రభుత్వం రుణాలు ఇచ్చింది. చిన్న కమతాలను సాగుచేసే రైతులు దాదాపు 3.5 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వీరందరూ తమ సామర్థ్యం మేరకు రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న వారే. మిగిలిన వారిలో ఐదు, పది ఎకరాలకు మించి సాగుచేసే వారిలో కొందరు రూ.2 లక్షల వరకు పంటరుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న దరిమిలా.. ఇప్పుడు అధికారులు ఏ జిల్లాలో ఎంత మంది రైతులు రుణాలు తీసుకున్నారు? అన్న లెక్కలు తీస్తున్నారు. ఇందుకోసం లీడ్ బ్యాంక్ మేనేజర్లు ఇప్పటికే నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపారని సమాచారం. మార్గదర్శకాల అనంతరం లబ్ధిదారుల విషయంలో స్పష్టత రానుంది.

**మార్గదర్శకాలు వస్తేనే.. స్పష్టత..**

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఒకసారి మార్గదర్శకాలు వస్తే రుణమాఫీ చేసే విధానంపై అందరికీ స్పష్టత వస్తుంది. రైతు భరోసాకు విధించిన తరహాలోనే రైతు రుణమాఫీలోనూ పలు మార్పులు ఉంటాయన్న ప్రచారం సాగుతోంది. అనర్హులను ముందే గుర్తించడం ద్వారా వీలైనంత ఎక్కువ మంది పేద రైతులకు సాయం చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయంగా కనిపిస్తోంది. అయితే, ఎవరు అర్హులు? ఎవరు అనర్హులు? అన్న విషయంలో ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిందని తెలిసింది. అందుకే, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఐదేళ్లకాలంలో చేసినట్లుగా రుణమాఫీ చేసేందుకు సిద్ధమైందని సమాచారం. రైతు రుణమాఫీ, లబ్ధిదారుల గణాంకాలపై సమీక్ష జరిపి త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రుణమాఫీకి కావాల్సిన నిధులు కేటాయిస్తారని సమాచారం.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

**జగిత్యాలజోన్:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మానసిక ఒత్తిడి, సమస్యలు లేని జీవితం పొందేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఉపశమనం ఇస్తుందని, శరీరానికి నూతన ఉత్సాహం కలిగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, మొదటి అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వినీల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్ కౌన్సిల్ చీఫ్ చంద్రమోహన్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో..**

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యోగా సాధన చేశారు. జిల్లా వైద్యాధికారి సమియోద్దీన్ మాట్లాడుతూ శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్యానికి యోగా ఉపయుక్తమని అన్నారు. అధిక రక్తపోటు, మానసిక ఆరోగ్య సమస్యల వంటి జీవనశైలి వ్యాధుల నియంత్రణలో యోగా అత్యంత ప్రభావాన్ని చూపుతుందన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు ఎ.శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



యోగా చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

# శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

- ఎస్పీ అశోక్‌కుమార్

**జగిత్యాలక్రైం:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్టపరిధిలో ప్రజాసమస్యలు పరిష్కరిస్తారన్నారు. సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని భరోసా కల్పించేలా పోలీసింగ్ ఉంటుందని తెలిపారు. గంజాయి రవాణా నిర్మూలనకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. రౌడీషీటర్లు, పాతనేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా ఎక్కువ నేరాలకు పాల్పడితే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. గల్ఫ్ మోసాలపై కూడా చర్యలు చేపడతామని, యువత అనుమతి లేని ఏజెంట్లను నమ్మి మోసపోవద్దన్నారు. సమావేశంలో ట్రెయినీ అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

**సమర్థవంతంగా విధులు నిర్వహించాలి**

పోలీసు శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏదైన సమస్యలు వస్తే నేరుగా తనను సంప్రదించవచ్చని ఉద్యోగులకు సూచించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఎస్బీ సీఐ నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

## డీపీఆర్వో బదిలీ

**జగిత్యాల:** జగిత్యాల డీపీఆర్వో భీంకుమార్ బదిలీ అయ్యారు. అతని స్థానంలో కరీంనగర్ ఏడీ లక్ష్మణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. బడిబాటలో భాగంగా ఇటీవల మినీస్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించకపోవడంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరడంతో బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

## క్లుప్తంగా

### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


రమేశ్(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ అన్నపూర్ణ కాలనీలో నివాసం ఉంటున్న కందుల రమేశ్(53) శుక్రవారం వేకువజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే జీవితంపై విరక్తి చెందిన రమేశ్.. తన ఇంటి ఎదుటల గల పశువుల కొట్టంలో కర్రకు నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహాలు అయ్యాయి. కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసుకున్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి..

రామగుండం: స్థానిక రైల్వే ఓవర్ హాలింగ్‌షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్ సిమ్మని శ్రీనివాస్(57) శుక్రవారం ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం రైల్వేకాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. శ్రీనివాస్ తన పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు, వ్యక్తిగత ఖర్చులకు కొంత అప్పు చేశాడు. వడ్డీ చెల్లించలేకపోవడం, అవసరాల కోసం మరికొంత అప్పు చేయడంతో చెల్లించే దారిలేక మనస్తాపానికి గురయ్యాడు. ఈనేపథ్యంలో భార్య అరుణతో తరచూ అప్పు విషయం చెబుతూ బాధపడేవాడు. ఈక్రమంలో శుక్రవారం తన బెడ్‌రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన భార్య.. ఇరుగుపొరుగు వారిని పిలిపించి కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు అభిరామ్, కూతురు శ్రీజ ఉన్నారు. పిల్లలు ఇద్దరూ అవివాహితులు. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

### బావిలో పడి యువకుడి మృతి


మహేశ్ మృతదేహం

ధర్మపురి: కూలీ పనులకు వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన దమ్మనపేటలో చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన శివరాత్రి మహేశ్(25) శుక్రవారం మండలంలోని దమ్మన్నపేటకు చెందిన జక్కుల రాజన్న వద్దకు కూలీ పనుల కోసం వెళ్లాడు. పనిలో భాగంగా బావి చుట్టూ తెట్టె కడుతుండగా ప్రమాదవశాత్తు మహేశ్ కాలుజారి బావిలో పడ్డాడు. బావిలో నీరు ఎక్కువగా ఉండటంతో ఈత రాక మునిగిపోయాడు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి శివారులోని ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి గురువారం అర్ధరాత్రి గీకురు జలంధర్(33) మృతి చెందాడు. మృతుడు గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి నివాసి. జలంధర్ సిరిసిల్ల వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇటీవల దుబాయి నుంచి వచ్చాడు. సోమవారం తిరిగి వెళ్లాల్సి ఉంది. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.



# ఇక రైతునేస్తం కేంద్రం

- అన్నదాత మాట.. వీడియో కాన్ఫరెన్స్ నోట
- ప్రతీ మండలానికి రైతునేస్తం
- రాష్ట్ర, కేంద్రం నుంచి నిర్వహించేలా సాంకేతికత

రాష్ట్రంలో ప్రస్తుతం 110కేంద్రాల్లోని రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులో ఉన్నాయి. ఈ నెలాఖరులోగా మరో 456 వేదికల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.

– తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి



కరీంనగర్ అర్బన్: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మూసధోరణిలో కాకుండా సాంకేతికత వైపు నడిపించేందుకు సౌకర్యాలు కల్పిస్తోంది. కాలానుగుణంగా వస్తున్న మార్పులను అవపోసన పడుతూ అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించనుంది. గత ప్రభుత్వం రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలనే రైతునేస్తం కేంద్రంగా మలచుకోవాలని నిర్ణయించింది. వేదికను అన్నదాతలకు మరింత ప్రయోజనకారిగా మార్చేందుకు యోచిస్తోంది. ఇప్పటికే నియోజకవర్గానికో రైతు వేదికను వీడియో కాన్ఫరెన్స్‌కు కేంద్రంగా మలచగా తాజాగా మండలానికో రైతు వేదికను రైతునేస్తం కేంద్రంగా మార్చనున్నారు.

**ప్రతిపాదనలు కోరిన ప్రభుత్వం**

రైతులకు అనువైన రైతు వేదికలను వీసీ కేంద్రాలుగా మలిచేందుకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం జిల్లా వ్యవసాయశాఖను ఇటీవల ఆదేశించింది. ఆయా మండలాల వారీగా రైతులకు సౌకర్యంగా ఉండే వేదికను ప్రతిపాదించాలని సూచించింది. నెట్‌వర్క్, సరిపడా స్థలం, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేయాలని నిర్దేశించగా జిల్లాలో కరీంనగర్ రూరల్‌లో గోపాల్‌పూర్, కొత్తపల్లి, మానకొండూరు, గన్నేరువరం, రామడుగు, గంగాధర, చొప్పదండి, తిమ్మాపూర్, శంకరపట్నం, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజూరాబాద్‌లో రాంపూర్, చిగురుమామిడి, వీణవంక, సైదాపూర్ కేంద్రాలను రైతునేస్తాలుగా వినియోగించనున్నారు. కాగా సమాచార మార్పిడి, పంట పరికరాలు, ఉత్పత్తులకు సంబంధించి రైతు వేదిక నిర్మించాలని 2017లో అప్పటి ప్రభుత్వం ప్రకటించగా 2020లో పూర్తి చేసింది. 313 గ్రామ పంచాయతీలుండగా 5వేల హెక్టార్లకో రైతు వేదిక నిర్మించారు. ఒక్కో క్లస్టర్‌కు 10 గుంటల నుంచి అర ఎకరం స్థలాన్ని గుర్తించారు. జిల్లాలో మొత్తం 76 రైతు వేదికలను నిర్మించగా ఏఈవోల కనుసన్నలో నిర్వహిస్తున్నారు. ఒక్కో వేదికకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.8లక్షలు, వ్యవసాయశాఖ నుంచి రూ.12లక్షలను కేటాయించగా మొత్తం రూ.20లక్షలతో నిర్మించారు. ఒక హాల్, రెండు గదులతో 2,046 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు.

**రైతు వేదికతో బహుళ ప్రయోజనం**

ఏ రైతు పట్టణాలకు వెళ్లకుండా సమీప ప్రాంతంలోనే అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా ఉండాలనేది రైతు వేదిక లక్ష్యం. వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం అందులోనే ఉండగా ప్రభుత్వ పథకాలు నేరుగా చేరుతున్నాయి. రైతులకు పంటల సాగు విధానంపై శిక్షణనిస్తూ అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకుంటుండగా ఆధునిక సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, మేలు రకమైన విత్తనాల ఎంపిక, తయారీ, సాగు మెలకువలతో అధిక దిగుబడులు సాధించడం, గిట్టుబాటు ధరలు పొందేలా వ్యవసాయశాఖ, అనుబంధ విభాగాల నుంచి ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తున్నారు. రైతు సమావేశమందిరాలుగా, గోడౌన్లుగా, విత్తన, ఎరువులు, ధాన్యం నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం మంగళ, శుక్రవారా ల్లో రైతు వేదికల్లో ఏఈవోల ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకముందు శిక్షణ కార్యక్రమాలను నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టనున్నారు. దీని ద్వారా రైతులకు పంటల సాగు విధానం, సస్య రక్షణ చర్యలు, తెగుళ్ల వాటి నివారణ చర్యలు నేరుగా తెలియజేసే వీలు కలుగుతుంది. ప్రభుత్వం అందించనున్న రైతుభరోసా, రైతుబీమా, పంట రుణాలకు సంబంధించిన ఎలాంటి సందేహానికైనా పరిష్కార మార్గాలను సులువుగా అందజేసే వీలుంది.

**రైతులకు ప్రయోజనం**

ప్రభుత్వం మండలానికో రైతు వేదికను వీసీ కేంద్రం(రైతు నేస్తం)గా మార్చడం రైతులకు ఎంతో ప్రయోజనకరం. అన్నదాతలకు ఎప్పటికప్పుడు సేద్యంలో మార్పులపై అవగాహన పెరుగుతుంది.

– బత్తిని శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి

# అల్ఫోర్స్‌లో యోగా ఉత్సవ్


యోగా చేస్తున్న అల్ఫోర్స్ విద్యార్థులు

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతీఒక్కరు ఆరోగ్యంగా జీవించాలంటే యోగా సాధన చేయాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కెడెట్లు పూజశ్రీ, సూర్యప్రకాశ్, యోగా శిక్షకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

**పారమిత హెరిటేజ్‌లో**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు పద్మనగర్, మంకమ్మతోటలోని పారమిత విద్యా సంస్థల్లో ఘనంగా జరిగాయి. వేడుకలలో భాగంగా యోగాసనాలు వేసిన పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు, తెలంగాణ పోలీస్ యోగా శిక్షకుడు ఉదయ్ కిరణ్‌రెడ్డి యోగా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు యోగాసనాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్లు అనూకర్‌రావు, రమణ, వినోద్ రావు, వీయూఎం.ప్రసాద్, హనుమంతరావు పాల్గొన్నారు.

**సెయింట్ జార్జ్‌లో**

కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఆసనాలు వేయించారు. యోగా ప్రాముఖ్యతను శిక్షకుడు ప్రవీణ్ కుమార్ వివరించారు. ఆరోగ్యంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు యోగా దోహదపడుతుందని పాఠశాల చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

## ప్రిలిమ్స్, మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ అభివృద్ధి అధికారి సాయిబాబా తెలిపారు. జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు జూలై 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూలై 7న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ప్రవేశం పొందితే లాడ్జింగ్, భోజనం, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5వేలు ఇవ్వడం జరుగుతుందని, బుక్‌ఫండ్ నిమిత్తం మరో రూ.5 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

### ఆర్టీసీ బస్సులో సైకో మహిళ వీరంగం

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో వేములవాడ నుంచి సిద్దిపేటకు వెళ్లే బస్సులో సైకో మహిళ వీరంగం సృష్టించింది. ఆ మహిళ నుంచి దుర్వాసతన రావడం, అసభ్య ప్రవర్తనతో తోటి ప్రయాణికులను ఇబ్బందికి గురిచేసింది. దీంతో ప్రయాణీకులు కండక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మహిళను మందలించిన కండక్టర్, బస్సు డ్రైవర్‌పై అమె తీవ్ర పదజాలంతో మాటల దాడిచేసింది. విసిగిపోయిన ప్రయాణికులు డయల్ 100కు ఫోన్‌చేశారు. వేములవాడ బస్టాండ్ నుంచి బయలుదేరిన బస్సును డిపో ముందు గంట సేపు నిలిపారు. అక్కడికి చేరుకున్న బ్లూకోర్టు సిబ్బందిపై ఆ మహిళ కత్తి చూపిస్తూ వీరంగం సృష్టించింది. వెంటనే మహిళ పోలీసులు వచ్చి అమెను బస్సు నుంచి దింపి పంపించారు. అనంతరం అక్కడి నుంచి ఆటోలో వెళ్లిపోయింది.

### దాడి సంఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన కులేరి దీప్తి కుమార్‌పై శుక్రవారం అకారణంగా దాడిచేసిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కిషన్‌రావు తెలిపారు. దీప్తికుమార్ తన ఇంటికి వెళ్తుండగా.. జనావాసాల్లో రోడ్డు పక్కన చింతకింది భాను, నిఖిల్ మరో యువకుడు మూత్ర విసర్జన చేస్తున్నారు. దానిపై ప్రశ్నించిన దీప్తికుమార్‌పై ముగ్గురు కలిసి బీరు సీసాతో దాడి చేశారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనాన్ని కింద పడేసి బీభత్సం చేసినట్లు ఫిర్యాదు చేయడంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### 22 నుంచి పాలిసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

జగిత్యాల: ఈనెల 22, 23, 24, 25 తేదీల్లో పాలిసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని పాలిసెట్ జిల్లా కన్వీనర్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. పాలిసెట్ విద్యార్థులు తమ సర్టిఫికెట్స్‌ను వారికి కేటాయించిన స్లాట్‌కు ఒక అరగంట ముందు కళాశాలకు చేరుకోవాలని అన్నారు. స్టడీ సర్టిఫికెట్లు, ఎస్సెస్సీ మెమో, టీసీ, ర్యాంక్‌కార్డు, హాల్‌టికెట్, ఆధార్, కులధ్రువీకరణ పత్రం, రెసిడెన్సీ, ఆదాయం సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

### వ్యక్తి అదృశ్యం


రంజిత్

మల్యాల: దైవ దర్శనానికి కుటుంబసభ్యులతో వచ్చిన మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన మల్యాల మండలంలో చోటుచేసుకుంది. మల్యాల ఎస్సై కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ మండలం కామారంకు చెందిన మతిస్థిమితం లేని నర్మెట రంజిత్(25) కుటుంబసభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చి, ఇక్కడే ఉంటున్నారు. ఈనెల 10న బహిర్భూమికి వెళ్లిన ఇతను తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి కవిత శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### కారు డ్రైవర్..


రితీక్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: నగరంలోని కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్న కారు డ్రైవర్ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మంచిర్యాల జిల్లాకు చెందిన అనపర్తి రితీక్ తన భార్య మైనాతో కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడు. రితీక్ కారు డ్రైవర్‌గా, మైనా ఓ ఆయుర్వేదిక్ షాపులో పనిచేస్తున్నారు. ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన రితీక్ తనస్కూటీని కమాన్‌వద్ద గల వాసవి అపార్ట్‌మెంట్ సమీపంలో పార్క్ చేశాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్‌స్విచాఫ్ వస్తుండడంతో తెలిసిన వాళ్లు, పనిచేసే చోట వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం తన భర్త కనిపించడం లేదని వన్‌టౌన్ పోలీసులకు మైనా ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. రితీక్ గతంలోనూ రెండుసార్లు ఇంట్లోంచి వెళ్లిపోయి తిరిగొచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### సిరిసిల్లలో రూ.కోటిన్నరతో వ్యాపారి పరార్

- ఇంటికి, దుకాణానికి తాళం
- ఆందోళనలో రుణదాతలు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌ప్రాంతంలో టీవీల షోరూం నిర్వహించే ఓ వ్యాపారి రూ.కోటిన్నరతో ఉడాయించాడు. సిరిసిల్లలో నమ్మకంగా వ్యాపారం చేసిన సదరు వ్యాపారి రూ.కోటిన్నర వరకు తెలిసిన వారి వద్ద, సమీప బంధువుల వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. పదిహేను రోజుల కిందటే దుకాణానికి, ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా ఊరి విడిచి వెళ్లాడు. అతనికి డబ్బులు ఇచ్చిన వారు షాపు వద్దకు వెళ్లి ఆరా తీస్తే పక్షం రోజులుగా రావడం లేదని తెలిసింది. ఇంటికెళ్లితే తాళం వేసి ఉంది. సదరు వ్యాపారి సిరిసిల్లలో చాలా రోజులుగా నమ్మకంగా వ్యాపారం చేసినట్లు సమాచారం. ఆ నమ్మకంతోనే అనేక మంది రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు అప్పుగా ఇచ్చినట్లు తెలిసింది. అప్పులిచ్చిన వారు వ్యాపారి కనిపించకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. కుటుంబంతో సహా వెళ్లిన సదరు వ్యాపారి పొరుగు రాష్ట్రంలో నివాసం ఉంటున్నట్లు భావిస్తున్నారు.

### దొంగల హల్‌చల్

- మల్లాపూర్, దేశాయిపల్లెలో రెండిళ్లలో చోరీ


వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మల్లాపూర్, దేశాయిపల్లె గ్రామాల్లో రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. మల్లాపూర్‌కు చెందిన బాస ఎల్లవ్వ ఆరుబయట నిద్రపోతుండా బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. అదే గ్రామానికి చెందిన తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేశ్‌లకు చెందిన రూ.30వేల విలువైన రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. దేశాయిపల్లెలో తేల్ల పర్శరాములు ఇంట్లో రూ.4వేలు ఎత్తుకెళ్లారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మద్యం దుకాణంలో చోరీ

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలం ముత్యంపేట గ్రామం దిగువ కొండగట్టులోని మద్యం దుకాణంలో గురువారం రాత్రి దొంగలు చొరబడి రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారు. మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాల ప్రకారం.. దిగువ కొండగట్టులోని ఆర్‌ఆర్‌ఆర్ వైన్స్‌ను నిర్వాహకులు గురువారం రాత్రి మూసి ఇంటికెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం రేకులను పగులగొట్టి లోనికి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. దుకాణ నిర్వాహకులు శుక్రవారం ఉదయం తెరిచేందుకు రాగా రేకులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి కౌంటర్‌ను పరిశీలించగా రూ.35 వేలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దుకాణదారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# విషాదం.. దిగ్భ్రాంతి


క్యాంపు కార్యాలయంలో గృహప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు (ఫైల్)

చొప్పదండి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి మరణం చొప్పదండి నియోజకవర్గంలో విషాదాన్ని నింపింది. ప్రేమపెళ్లి రూపాదేవి, సత్యం దంపతులకు కుమారుడు, కూతురు ఉండగా, హైదరాబాద్ శివారులోని అపార్ట్‌మెంట్‌లో ఏడాదిగా నివాసముంటున్నారు. ఉపాధ్యాయురాలుగా పనిచేసే రూపాదేవి గత పదేళ్లుగా కరీంనగర్ జిల్లాకు వచ్చిన సందర్భాలు తక్కువ. సత్యం ఎమ్మెల్యేగా గెలుపొందాక రూపాదేవి జిల్లాకు మూడు, నాలుగుసార్ల కన్నా ఎక్కువగా వచ్చిన దాఖలాలు లేవు. ఏప్రిల్ 19న నియోజకవర్గ కేంద్రమైన చొప్పదండిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజలు నిర్వహించారు. కొడిమ్యాల మండలం నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన పూజల్లోనూ పాల్గొన్నారు. ఫిబ్రవరి 23న కొడిమ్యాలకు చెందిన చిలువేరి నరేశ్ ఇంట్లో నాలుగు నెలల చిన్నారికి గుండె సంబంధిత వ్యాధి చికిత్సకోసం ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే దంపతులు వెళ్లి రూ.లక్ష సాయం అందించారు. రూపాదేవి ఆత్మహత్య విషయం తెలియగానే నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హైదరాబాద్‌కు తరలివెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత మేనేని రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, నియోజకవర్గ ముఖ్య నాయకులు సత్యంను పరామర్శించారు.

## గుడుంబా రహిత జిల్లాగా తీర్చిదిద్దేలా చర్యలు


మాట్లాడుతున్న సత్యనారాయణ

జగిత్యాలక్రైం: గుడుంబా రహిత జిల్లాగా తీర్చిదిద్దేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గుడుంబా తయారీ, అమ్మకందారులను ఉపేక్షించవద్దని, నేరం ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటుసారా లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, స్పటిక అమ్మే వారిపై కఠిన చర్యలుంటాయని తెలిపారు. ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీయాక్ట్ చట్టం కింద అరెస్టు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐలు మహేందర్‌సింగ్, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, జగిత్యాల రూరల్, మల్యాల, ధర్మపురి సీఐలు ఆరీఫ్ అలీఖాన్, రవి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా చేస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలక్రైం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యోగా విద్య ఒక అద్భుతమైన ప్రక్రియ అని, మన భారతావని ప్రపంచానికి అందించిన ఆరోగ్యఫలం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవీంద్రకుమార్, రంగారెడ్డి, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, రాము, నర్సింహారెడ్డి, ఆర్ఐలు జానివిఎయా, రామకృష్ణ, వేణు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు


కలెక్టర్‌ను స్వామివారి శేషవస్త్రంతో సన్మానిస్తున్న ఈవో

జగిత్యాలక్రైం: ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్‌ను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలను కాపాడే దిశలో ప్రజలతో మమేకమై ప్రత్యేక మార్పు తీసుకురావాలని కోరారు. గంజాయి సరఫరాను అరికట్టేందుకు చర్యలు తీసుకుని, పిల్లలు మారకద్రవ్యాలకు బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**కలెక్టర్‌ను కలిసిన ఈఓ**

ధర్మపురి: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సత్యప్రసాద్‌ను ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈఓ శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామి వారి శేషవస్త్రం కప్పి ప్రసాదం, ఫొటో అందజేశారు. స్వామి వారి దర్శనానికి రావాలని ఆహ్వానించారు. ఈఓ వెంట సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులున్నారు.

## రూ.15లక్షల భూమి వితరణ


భూమి పత్రాలను అధికారులకు అప్పగిస్తున్న కైలాసం

సారంగాపూర్: రోజు స్వామి వారి సేవలో నిమగ్నమయ్యే అర్చకుడు లక్షలాది రూపాయల విలువ చేసే భూమిని ఆలయానికి అందించి తన భక్తిని చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న శానగొండ కైలాసం రూ.15లక్షల విలువ చేసే భూమిని శుక్రవారం ఆలయానికి విరాళంగా అందజేశాడు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయానికి ఈశాన్యంలో ఉన్న 90 గజాల ఖాళీ స్థలం ఆలయ ప్రాకార నిర్మాణానికి అవసరం ఉంది. దీంతో ఆలయ అధికారులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సంవత్సర కాలంగా ఈ భూమిని సేకరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అర్చకుడు కైలాసంకు డబ్బులు చెల్లించి భూమి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కైలాసం తాను చేసేది స్వామి సేవ అని ఒక్క రూపాయి అవసరం లేదని భూమిని ఉచితంగా అందజేస్తున్నట్లు ప్రకటించి ఆలయ ఈవో కాంతారెడ్డికి భూమిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కైలాసంను పలువురు అభినందించారు.

## జయశంకర్ సార్ స్ఫూర్తిని కొనసాగించాలి


నివాళి అర్పిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్, ఉద్యోగులు

జగిత్యాలజోన్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలను శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ జయశంకర్ సార్ స్ఫూర్తిని గత ప్రభుత్వం కొనసాగించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్, సీఈవో రఘువరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## కొలిక్కిరాని డబ్బు మళ్లింపు లెక్క

జగిత్యాల: జిల్లా వైద్య విధాన పరిషత్‌లో పనిచేసే ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతా నుంచి డబ్బు మాయం చేసిన విషయంపై లెక్క కొలిక్కి రావడం లేదు. ఈనెల 16న 'జీపీఎఫ్ నిధులు మాయం' శీర్షికన 'సాక్షి' వెలుగులోకి తీయడంతో విచారణ అధికారిగా బాన్సువాడ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్‌ను నియమించారు. ఐదు రోజులుగా విచారణ చేపడుతున్నారు. ఇతర ఖాతాలోకి డబ్బులు మళ్లించిన ఉద్యోగిని సస్పెండ్ చేశారు. కానీ ఇతను ఉద్యోగులకు సంబంధించిన సీపీఎస్, జీపీఎఫ్ డబ్బులను వాడుకుని మళ్లీ కొన్ని డబ్బులు అందులో వేశారు. దీంతో బ్యాంక్ స్టేట్‌మెంట్లలో గందరగోళంగా మారింది. అధికారులకు సైతం అర్థం కాని పరిస్థితి నెలకొంది. అసలు ఎన్ని డబ్బులు వచ్చాయి, ఎంత మేరకు డబ్బులు రిటర్న్ వేశాడు అన్నది కొలిక్కి రావడం లేదు. సస్పెండ్ అయిన అధికారి సైతం లెక్కలు చెబుతున్నప్పటికీ ఏ విధంగా ట్రాన్స్‌ఫర్ అయ్యాయి అంతుపట్టడకుండా ఉన్నాయి. విచారణ ఇంకా వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు అతని నుంచి రూ.50.12 లక్షలు రికవరి మాత్రం చేశారు.

**విచారణ కొనసాగుతుంది**

విచారణ కొనసాగుతుంది. ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్లు చేయడంతో ఎవరికి వెళ్లాయి, ఎలా వెళ్లాయని వెరిఫికేషన్ చేస్తున్నారు. మరో 2–3 రోజుల్లో విచారణ పూర్తవుతుంది. బ్యాంక్ ఓచర్లు, రికార్డులన్నింటినీ పరిశీలిస్తున్నాం.

– సుదక్షిణదేవి, డీసీహెచ్‌ఎస్ అధికారి